క్లుప్తంగా

పొలం పనుల్లో బిజీ.. బిజీ



దుక్కి చేస్తున్న రైతులు

జి.సిగడాం: మెట్ట ప్రాంతాల్లో పంటలు సాగుచేసేందుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే మొక్కజొన్న, వేరుశనగ పంటలను పలు గ్రామాల్లో వేస్తున్నారు. వర్షాలు అనుకూలించడంతో మండల పరిధిలో దేవరవలస, వెలగాడ, చెట్టుపొదిలాం, పెంట, నాగులవలస, మద్రివలస, సీతంపేట, ఎందువ, బాతువ, జాడ, జగన్నాథవలస, జి.సిగడాం గ్రామాలతోపాటు పలు గ్రామాల్లోని మెట్ట ప్రాంతాల్లో మొక్కజొన్న, వేరుశనగ పండించేందుకు రైతులు పొలాలను సిద్ధంగా చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్‌కు శుభాకాంక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్)ను బంటుపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎచ్చెర్ల మండల గ్రామ సచివాలయ సర్వేయర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయాల్లో అందజేస్తున్న సేవలను వివరించారు.
18 ఈటీఎల్ 23: ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గ్రామ సచివాలయ సర్వేయర్లు

బీజేపీ బలోపేతమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అరిణాంఅక్కివలసలో మంగళవారం బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి, పార్టీ ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తసుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కన్వీనర్ సంపతరావు నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు పుణ్యపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షత వహిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

మురపాకలో పారిశుద్ధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను శుభ్రం చేసి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

వరి విత్తనాల పంపిణీ



ఎరువులు, విత్తనాల పంపిణీలో ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: సింగుపురం (కిష్టప్పపేట) రైతు భరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ విత్తనాలను, ఎరువులను అందజేశారు. శ్రీకాకుళం రూరల్ మండలానికి 1546 క్వింటాళ్ల వరి విత్తనాలు వచ్చినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ముందుగా ఎరువులను అందిస్తున్నామన్నారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేలకు ఇండెంట్ ప్రకారం విత్తనాలను పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ బగ్గు రజనీ, ఉషాకుమారి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

20న ద్విచక్ర వాహనాలు వేలం

వజ్రపుకొత్తూరు రూరల్: పలు మద్యం కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు పలాసలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు ఎస్‌ఈబి స్టేషన్ సీఐ ఎం.ఆర్.వి. అప్పారావు మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డుతో పాటు వెయ్యి రూపాయల ప్రవేశ రుసుం చెల్లించాలని సూచించారు. వేలంలో సొంతం చేసుకున్న వారికి ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వాహనాలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94409 02357 నంబర్‌ను సంప్రదించాలి.

• అంకురారోపణ



శ్రీకాకుళం నగరంలోని గుడివీధిలో వేంచేసిన బలరామ ప్రతిష్ఠ ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం అంకురారోపణ పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల నేతృత్వంలో వేమూరి ప్రభాకరశర్మ మంత్రోచ్ఛారణలతో శివ పార్వతుల ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి గన్నవరపు కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులచే వార్షిక కల్యాణ వేడుకలలో భాగంగా ప్రధాన ప్రవేశ స్థాలీపాక హోమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సర్వేశ్వరరావు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. -శ్రీకాకుళం కల్చరల్

• సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



శ్రీకాకుళం గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరిదేవి పీఠంలో వేంచేసిన సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

• విజయగణపతికి అభిషేకాలు



శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయగణపతి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని అష్టోత్తర శతనామాలతో ప్రత్యేకంగా పూజలు చేసి హారతులు ఇచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

భద్రాంబికాతల్లీ.. కాపాడమ్మా..



అమ్మవారి జంగిడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

- ఘటాలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామదేవత మోహినీ భద్రాంబికా అమ్మవారి పండుగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా జ్యేష్ఠ మాసంలో నిర్వహించే ఈ ఉత్సవం మంగళవారం సాయంత్రం స్థానికులతో పాటు సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులుగా పలు వేషధారణలు, ఎగ్జిబిషన్ వంటివి జరిగాయి. సాయంత్రం నుంచి ఇంటికో ఘటం చొప్పున బయలు దేరి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నాయి. ముందుగా అమ్మవారి బుట్ట (జంగిడి) గ్రామంలో అన్ని వీధులను తిరుగుతుండగా, ఘటాలను మహిళలు వెంట తీసుకువెళ్లారు. జంగిడి భక్తురాలుకు పావడాలు వేయడంతోపాటు పాదాలు కడిగారు. బుట్టలో అరటి పండ్లు వేసేందుకు భక్తులు ఎగబడ్డారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయగా.. గార ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీకూర్మం మెయిన్‌రోడ్

30న కాటమ్మతల్లి సంబరాలు

కాశీబుగ్గ: ఈ నెల 30వ తేదీన జరగనున్న కాటమ్మ తల్లి సంబరాలను విజయవంతం చేయాలని 17వవార్డు కౌన్సిలర్, పట్టణ ఆటోయూనియన్ గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏఎంసి గోదాం సమీపంలో మంగళవారం రాత్రి పట్టణ ఆటో యూనియన్ సభ్యులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి గోపయ్య, కిర్రి బాబూరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న హెచ్‌ఎం మళ్లేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్టూడెంట్ కిట్లు అందజేశారు. హెచ్‌ఎం పైడి మళ్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ జరగుళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లిని కలిసిన ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్



మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

రణస్థలం: రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరంలోని మంత్రి క్యాంప్ ఆఫీస్‌కు ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి నాయకులతో కలిసి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసిన ఎస్పీ రాధిక



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక



రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును జెడ్పీ సమావేశ మందిరంలో ఎస్పీ జీఆర్ రాధిక మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు జరిపిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు.

-శ్రీకాకుళం క్రైం

శ్రీముఖలింగంలో హోమం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఔపాసన, హోమం, బలిహరణ, హారతి మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం నిర్వహించారు.



హోమం, బలిహరణ నిర్వహిస్తున్న అర్చకులు

భూ ఆక్రమణలను గుర్తించండి

- పలాస ఆర్డీవో భరత్ నాయక్

కాశీబుగ్గ: భూఆక్రమణలను గుర్తించి వాటిపై చర్యలు చేపట్టడానికి అధికార యంత్రాంగం సిద్ధం కావాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌తో మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ అధికారి తమ పరిధిలో ఉన్నటువంటి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడానికి సిద్ధం కావాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. భూ ఆక్రమణలు, స్పందన, శానిటేషన్ తదితర అంశాలపై సమీక్షించారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

రాయితీపై వరి విత్తనాలు



పలాసపురంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు యశోద



సుంకిడిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి నర్సింహమూర్తి

సోంపేట: జాతీయ ఆహార భద్రత మిషన్ రాయితీతో వ్యవసాయశాఖ ద్వారా సరఫరా చేస్తున్న వరి విత్తనాలను పలాసపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకురాలు జీవిత పాల్గొన్నారు. అలాగే సుంకిడి, కొర్లాం, మాకన్నపురం గ్రామాల్లో వ్యవసాయధికారి బి.నర్సింహమూర్తి వరి విత్తనాలను రైతులకు అందజేశారు. విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గాన్ని రానున్న ఐదేళ్లలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. టెక్కలి నియోజకవర్గ ప్రజానీకం ఎన్నికల్లో భారీమెజారీతో తనను గెలిపించారని.. వారి ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తామన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు క్రియాశీలంగా వ్యవహరించి ప్రభుత్వానికి, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్, నాయకులు కింజరాపు హరివరప్రసాద్, వి.కామేశ్వరరావు, కె.గోవిందరావు, మజ్జి కృష్ణారావు, మెట్ట మోహన్, మూగు అచ్చెయ్య రెడ్డి ఉన్నారు.

జీవాల సేవలో సత్యసాయి భక్తులు!

- మూగజీవాల దాహార్తి తీరుస్తున్న వైనం
- చలివేంద్రాల ఏర్పాటు



పలాస పురుషోత్తపురం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

కాశీబుగ్గ: దాహం వేస్తే మంచినీటి కోసం వెతుకుతాం. పట్టణ ప్రాంతంలో గుక్కెడు నీరు కావాలంటే కొనుక్కుని తాగుతాం. నగదు లేనివారైతే దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, పబ్లిక్ కుళాయిలపై ఆధారపడి దాహాన్ని తీర్చుకుంటారు. ఇది నోరున్న మనుషులకు వర్తిస్తోంది. మరి నోరులేని మూగజీవాల పరిస్థితి ఏమిటి? ఆలోచిస్తే పాపం అనిపించక మానదు. రోడ్లు, భవనాలు కనిపిస్తున్న ప్రాంతంలో మూగజీవాలకు ప్రాణ సంకటమనే చెప్పాలి. అటువంటి మూగ జీవాలకు మూగ మనసులగా మేమున్నామని ముందుకు వచ్చారు సత్యసాయి సేవా సమితి సభ్యులు. మనుషులకే చలివేంద్రాలు కాదు పశు పక్ష్యాదులకు మేమున్నామంటూ.. జీవాల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసి..వాటి దాహార్తి తీర్చి ఆదర్శంగా నిలుస్తున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పలాస సత్యసాయి సేవా సమితి సభ్యులు వేసవి ప్రారంభం నుంచి జూన్ మాసాంతం వరకూ పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. వేసవి రోజుల్లో పలు జంక్షన్లలో మనుషుల కోసం తొలుత చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఆ తరువాత మూగ జీవాల కోసం కూడా చలివేంద్రాలు నెలకొల్పారు. మూగజీవాలు పట్టణాలలో నడుస్తూ దుకాణాల వద్దకు వచ్చి మురుగు నీరు తాగడం, ఆరుబయట వృథాగా పోతున్న నీరు తాగడం, దుకాణాల వద్దకు వచ్చి కడిగేందుకు ఉంచిన నీటిని దొంగతనంగా తాగడం వంటి అంశాలను గుర్తించి మూగజీవాల పడుతున్న బాధను చూసిన సత్యసాయి సేవా సమితి సభ్యులు సమావేశం పెట్టుకున్నారు. జీవాల దాహార్తి తీర్చాలని తలపించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా జంటపట్టణాలలోని ముఖ్యమైన కూడళ్లను గుర్తించారు. సిమెంట్ గొలెలాను ఏర్పాటు చేసి వాటిలో ట్యాంకుల ద్వారా మంచినీటిని పోయిస్తున్నారు. అక్కడితో ఆగకుండా ప్రతి రెండు రోజులకు గొలెలాను కడగడం చేస్తుంటారు. అలాగే కొంతమంది శక్తిమేరకు పశువులకు పండ్లను సైతం అందిస్తున్నారు. ట్యాంకుల ద్వారా నీటిని తీసుకొచ్చి గొలెలాను నింపుతున్న విషయాన్ని గమనించిన మహిళలు స్పందించారు. మహిళలు సైతం గొలెలలో నీటిని తీసుకొచ్చి పోయడం ప్రారంభించారు. జీవాల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామంటే చాలామంది తొలుత నవ్వుకున్నారు. అయితే ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో అలాంటివారు ముక్కున వేలేసుకుంటున్నారు.



పలాసలోని శివారు వీధిలో చలివేంద్రం వద్ద పశువులకు పండ్లు పెడుతున్న సాయి భక్తులు



పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలను కలిపే రోడ్డు పక్కన నీటితో గొలెం



కాశీబుగ్గలోని ఓ దుకాణం సమీపంలో ఏర్పాటు చేసిన గొలెంలో నీరు